నీటి మూటలు.. హైడ్రా మాటలు

- ఆక్రమణల తొలగింపుపై మీన మేషాలు
- నందినగర్‌లో స్థానికుల అష్టకష్టాలు
- దారి లేకపోవడంతో బస్సులు బంద్
- హైడ్రా రంగంలోకి దిగాలని స్థానికుల డిమాండ్

బంజారా హిల్స్ రోడ్ నం.14లోని నందినగర్ గ్రౌండ్స్‌లో యథేచ్ఛగా ఆక్రమణలు

బంజారాహిల్స్, జనవరి 19: హడ్రా మాటలు నీటి మూటలు అవుతున్నాయి. చెప్పేదొకటి.. చేసేదొకటిగా అగుపిస్తున్నది. 'ప్రభుత్వ స్థలాలు, పార్కులు, చెరువుల కబ్జాలపై ఉక్కుపాదం మోపుతాం' అంటూ తరచు ప్రకటనలు గుప్పించే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హైడ్రా మాటలు కొన్ని ప్రాంతాల్లో మాత్రం నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయా..? నగరం నడిబొడ్డున ఖరీదైన స్థలాలు కబ్జాలకు గురయినా పట్టించుకోకపోవడానికి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం.14 నందినగర్ గ్రౌండ్స్‌లో ఏడాదిగా ఇబ్బడి ముబ్బడిగా ఆక్రమణలతో స్థానికంగా ఎన్నో స్థలాలు మాయమయ్యాయి. ఎక్కడ చూసినా షెడ్లు, హోటళ్లు, పాన్‌షాపులు, ప్లాస్టిక్ షీట్లతో దుకాణాలతో విశాలంగా ఉన్న మైదానం కుంచించుకుపోయింది. కొంత మంది అధికార పార్టీ కార్యకర్తల కాసుల కక్కుర్తితో రోడ్ల పక్కనున్న స్థలాలు, వీధి స్థలాలను ఆక్రమించారు. దీంతో నందినగర్‌లోని మైదానం మొత్తం ఇరుకుగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సులు కూడా రాలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న కొంతమంది తాత్కాలిక షెడ్లు వేసుకొని, డబ్బాలు, బిల్డింగ్ మెటీరియల్ వేస్తూ ఇంకా వ్యాపారాలు ఏర్పాటు చేస్తున్నారు. మరి కొంతమంది అధికార పార్టీ కార్యకర్తలు నెలనెలా అద్దెలు వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంత రోజున పరిస్థితి మరీ ఘోరంగా తయారవుతుందని, కనీసం నడిచేందుకు కూడా అవకాశం లేకుండా షాపులు ఏర్పాటు చేయించి అద్దెలు వసూలు చేస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న నందినగర్ గ్రౌండ్ కళ్ల ముందే మాయమయిపోయినా రెవెన్యూ శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, ట్రాఫిక్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడం వెనక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమయి ఉంటాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నందినగర్ గ్రౌండ్స్‌లో ఆర్టీసీ బస్సును రివర్స్ చేసుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో ఆరు నెలలుగా ఇక్కడకు వచ్చే 47ఎన్, 127 ఎన్ బస్సులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారని, దీంతో తామంతా ఎక్కువ డబ్బు చెల్లించి ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు బందోబస్తు కోసం లేఖ రాశాం

నందినగర్ గ్రౌండ్‌లో ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ స్థలం మొత్తం ప్రభుత్వ స్థలంగా రికార్డుల్లో ఉంది. దీన్ని ల్యాండ్ బ్యాంక్ జాబితాలో చాలా ఏండ్ల క్రితమే చేర్చారు. ఆక్రమణలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం, హైడ్రా అధికారుల సహకారం తీసుకుంటాం. ఆక్రమణల తొలగింపు కోసం బందోబస్తు కల్పించాలని ఇటీవల బంజారాహిల్స్ పోలీసులకు లేఖ రాశారు. పోలీసులు బందోబస్తు ఇవ్వగానే ఆక్రమణలను తొలగిస్తాం. – అనితా రెడ్డి. తహసీల్దార్, షేక్‌పేట మండలం

గోవర్ధనగిరి కల్యాణ మండపం సీజ్

కేపీహెచ్‌బీ కాలనీలో మూసేసిన హౌసింగ్ బోర్డు అధికారులు

నోటీసులు ఇవ్వకుండానే.. సీజ్ చేయడంపై అభ్యంతరాలు

గోవర్ధనగిరి కొండపై కల్యాణ మండపం – (ఇన్‌సెట్) సీజ్ చేసిన దృశ్యం

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 19: కేపీహెచ్‌బీ కాలనీలోని గోవర్ధనగిరి కొండపై కళ్యాణ మండపాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు సీజ్ చేశారు. ఎన్నో ఏండ్లుగా గోవర్ధనగిరి కొండపై వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు కల్యాణ మండ పం, గోశాలలు ఉన్నాయి. ఈ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే ఉత్సవాల కోసం కల్యాణ మండపాన్ని నిర్మించగా, ఈ మండపంలో స్వామివారి కల్యాణ వేడుకలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు లేనప్పుడు స్థానికులు పెండ్లీలకు, ఇతర శుభ కార్యక్రమాలకు మండపాన్ని వినియోగిస్తున్నారు. కొన్నేండ్లుగా కొనసాగుతున్న కల్యాణ మండపానికి గతంలో ఏనాడు నోటీసులు ఇవ్వలేదు. కాగా, శనివారం అకస్మాత్తుగా హౌసింగ్ బోర్డు వెస్టన్ డివిజన్ అధికారులు వచ్చి మండపాన్ని సీజ్ చేసి వెళ్లిపోయారు. ఈ విషయం కేపీహెచ్‌బీ కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి రావడంతో హౌసిం గ్ బోర్డు అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం లో ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గుడులకు కూడా రక్షణ లేకుండా పోయిందని, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలలో ఎన్నో ఎకరాల హౌసింగ్ బోర్డు స్థలం అన్యాక్రాంతమైనా పట్టించుకోని అధికారులు, వేణుగోపాల స్వామి దేవాలయంలోని కల్యాణ మండపాన్ని ఎందుకు సీజ్ చేయాల్సి వచ్చింది? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో హౌసింగ్ బోర్డు ఎస్ఈ, ఈఈలను వివరణ కోరితే వారు స్పందించడం లేదు. కింది స్థాయి అధికారులు మాత్రం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్యాణ మండపాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన విషయాలను వారినే అడగాలని చెబుతున్నారు.

శ్రీవాణి విద్యాలయ స్వర్ణోత్సవాలు


శ్రీవాణి విద్యాలయం స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భువనగిరి అర్బన్, జనవరి 19 : పట్టణంలోని శ్రీవాణి ప్రైవేటు విద్యాలయం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం విద్యాలయ స్వర్ణోత్సవాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పడమటి జగన్మోహన్‌రెడ్డి, దొంత లక్ష్మణ్, మంచాల శ్యామ్, గంజి రమేశ్, కొలుపుల వివేకానంద, పాల్గొన్నారు.

బంజారా ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

సంస్థాన్ నారాయణపురం, జనవరి 19 : మండలంలోని గిరిజన తండాలకు చెందిన బంజారా ఉద్యోగులు రైతు వేదికలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అవుతున్న ప్రభుత్వ బంజారా ఉద్యోగులను, కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారిని బంజారా ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు ప్రేమ్‌సింగ్, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ సురేశ్‌నాయక్, వాంకుడోతు బన్సీలాల్, ఆంగోతు శంకర్‌నాయక్, కొర్ర జగ్రాం, ఉదావత్ లచ్చిరాం నాయక్, భాగ్యానాయక్, బద్యా నాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

జన జాతర.. కొమురవెల్లి

పట్నం.. పరవశం

కొమురవెల్లి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

వైభవంగా పట్న వారం.. 50 వేల మంది భక్తులు హాజరు

నేడు పట్నం, అగ్నిగుండం

చేర్యాల, జనవరి 19: గజ్జెల లాగులు.. ఢమరుక నాదాలు... డోలు చప్పుళ్లు... అర్చకుల పూజలు.... ఒగ్గు కథ పూజారుల పట్నాలు, పోతరాజుల విన్యాసాలు.. మహిళల బోనాల సమర్పణతో ఆదివారం మల్లన్న క్షేత్రం పులకించిపోయింది. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన పట్నం వారానికి 50 వేల మంది వరకు భక్తులు హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి వారాన్ని పట్నం వారంగా పిలువడం ఆనవాయితి. పట్నం వారానికి హైదరాబాద్ భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, పెద్ద పట్నం వేసి అగ్నిగుండం దాటుతారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన బంధువులు, స్నేహితులతో కలిసి దర్శించుకున్నారు. ఉత్సవాలకు శనివారం సాయంత్రం నుంచే భక్తులు కొమురవెల్లి క్షేత్రానికి రావడం ప్రారంభమైంది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, బైక్‌లపై భారీగా భక్తులు వచ్చారు. ఉదయం ఐదు గంటలకు ప్రారంభమైన దర్శనాలు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. ధర్మ దర్శనానికి నాలుగు గంటలు, ప్రత్యేక దర్శనానికి 2.30 గంటలు, శీఘ్ర దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. ఆలయ ఈవో కె.రామాంజనేయులు, కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. అద్దె గదుల వద్ద చిలుకపట్నం, గంగరేగు చెట్టు వద్ద నజరు పట్నం, మహా మండపంలో ముఖ మండప పట్నాలు వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి కల్యాణం నిర్వహించడంతో పాటు అమ్మవార్లకు ఒడి బియ్యం పోయడం, అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు మల్లన్నను దర్శించుకుని పట్నాలు వేసి, మల్లన్న గుట్ట పైన ఉన్న ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, జనగామ తదితర జిల్లాల నుంచి వచ్చే దారులన్నీ కొమురవెల్లి క్షేత్రం వైపే పరుగులు తీశాయి. రెండు కిలోమీటర్ల మేర దారులు భక్తులతో నిండిపోయాయి. సోమవారం మల్లన్న ఆలయ వర్గాల సహకారంతో హైదరాబాద్ ఒగ్గు పూజారుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ భక్తులు మల్లన్న క్షేత్రంలోని కల్యాణ వేదిక వద్ద పెద్ద పట్నం వేసి అగ్నిగుండం తయారు చేస్తారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్ద పట్నం, అగ్నిగుండం దాటి స్వామి వారిని మరోసారి దర్శించుకుంటారు. అనంతరం, నల్ల పోచమ్మ, కొండ పోచమ్మ ఆలయాలకు వెళ్లి అక్కడ అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

ప్రభుత్వంపై ప్రజల్లో 60శాతం అసంతృప్తి

సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లింగయ్యయాదవ్

పోలెబోయిన లింగయ్యయాదవ్, కాంగ్రెస్ అడ్డగూడూరు మండలాధ్యక్షుడు

అడ్డగూడూరు, జనవరి 19 : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే 60 శాతం అసంతృప్తి ఉన్నదని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పార్టీ మండలాధ్యక్షుల వాట్సాప్ గ్రూప్‌లో ఆదివారం పోస్టు పెట్టారు. ఇది వైరల్‌గా మారింది. తాను 20 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని లింగయ్యయాదవ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ లబ్ధిదారుల ఎంపిక కాంగ్రెస్ మండలాధ్యక్షులకు, గ్రామ శాఖ అధ్యక్షులకు, సీనియర్ కాంగ్రెస్ నాయకులకు తెలియకుండా లిస్ట్ తయారు చేసి తాసీల్దార్లు, ఎంపీడీఓలకు పంపి సర్వే చేయించి గ్రామసభలు పెట్టి పథకాలు అందజేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. అధికారులకు లిస్ట్ పెట్టి వారితో పథకాలు ఇస్తే గ్రామాల్లో తమ ముఖం ఎవరు చూస్తారని ప్రశ్నించారు. ఇలా అయితే త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ప్రజల దగ్గరికి వెళ్లాలని పేర్కొన్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి వరకు వెళ్లేలా చేయాలని సూచించారు. ఇలా అయితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో రావడం కలేనంటూ లింగయ్యయాదవ్ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

టీచర్ నిర్మలకు సౌత్ ఇండియా ఉమెన్ ఇన్‌స్పిరేషన్ అవార్డు

సినీ నటి కవిత చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు నిర్మల

బీబీనగర్, జనవరి 19 : హైదరాబాద్‌లోని శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పట్నం కమలా మనోహర్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందించిన మహిళలకు సౌత్ ఇండియా ఉమెన్ ఇన్‌స్పిరేషన్ 2025 అవార్డులను అందజేశారు. ఇందులో మండలంలోని మగ్దుంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వి.నిర్మల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. లక్డీకాపుల్‌లోని బిర్లా ప్లానిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మలకు నటి కవిత అవార్డు అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రజనీకర్

ఆలేరు టౌన్, జనవరి 19 : పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సైనిక గ్రూప్ సౌజన్యంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆదివారం ఎస్ఐ కె.రజనీకర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతనందించి పోలీసులుగా తయారు చేయడమే లక్ష్యంగా సైనిక గ్రూప్ పని చేస్తుందన్నారు. ఈ పుస్తకాలు ఆర్మీ, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ ఉద్యోగాలు సాధించడానికి దోహదపడుతాయని తెలిపారు. సైనిక గ్రూప్ ఫౌండర్, కానిస్టేబుల్ బండారి ప్రసాద్‌ను ఎస్ఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఫైజల్, విజయ, ఏఎస్ఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ జహంగీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటు చేయాలి : సీపీఐ

వీరవెల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 19 : పట్టణంలోని బైపాస్ రోడ్డు ప్రభుత్వ ఐటీఐ దగ్గర అండర్ పాస్ నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మండలంలోని వీరవెల్లి గ్రామంలో ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే అండర్ పాస్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మరిపెళ్లి రాములు, మాజీ సర్పంచ్ కస్తూరి భిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ రేగు అంజయ్య, నాయకులు గోపాల్, వెంకట్‌రెడ్డి, శ్రీను, బీరప్ప, శ్రీశైలం, శంకరయ్య, రాజు, మైసయ్య పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

వలిగొండ, జనవరి 19 : మండలంలోని గోకారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు మద్దెల సత్తయ్య ఆదివారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. గీత కార్మికుడికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా అందజేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు కోరారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మోత్కూరు, జనవరి 19 : సంగారెడ్డిలో ఈ నెల 25నుంచి 28వరకు జరుగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లను మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు కురిమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, బండి రవి, మల్లమ్మ, ఎల్లారెడ్డి, అంజిరెడ్డి, భిక్షంరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిల్చిన యోధుడు సాయన్న

మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

జిల్లెలగూడ చందన చెరువు కట్టపై పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

జిల్లెలగూడ చందన చెరువు కట్టపై పండుగ సాయన విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చిత్రంలో తదితరులు

బడంగ్‌పేట, జనవరి 19: రజాకార్లు చేస్తున్న దుర్మార్గాలను ఎదిరించి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసిన గొప్ప యోధుడు పండుగ సాయన్న అని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై మీర్‌పేట ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, నీలం మధు ముదిరాజ్‌లతో కలిసి మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి ప్రజలకు అండగా నిల్చారన్నారు. అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ సాయన్న ప్రత్యక్షం అయ్యేవారన్నారు. పేదల కడుపు నింపిన వీరయోధుడు పండుగ సాయన్న అని ఆమె కొనియాడారు. సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని రజాకార్లపై తిరుగుబాటు చేశారన్నారు. అలాంటి మహనీయుని విగ్రహం తన నియోజకవర్గంలో ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పండుగ సాయన్నను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజల కోసం త్యాగాలు చేసిన వారి చరిత్రలను తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ బీలోకి మార్చే విధంగా చొరవ తీసుకోవాలని సంఘం నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్, బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, ఏ.శంకర్ రెడ్డి, అర్కల కామేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, దండు గణేశ్ ముదిరాజ్, రాఘవేందర్ ముదిరాజ్, శివశంకర్ ముదిరాజ్, దయానంద్ ముదిరాజ్, కార్పొరేటర్లు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆక్యుపంచర్ శిబిరం ప్రారంభం

జిల్లెలగూడ చందన చెరువు కట్టపై వేముల విజయ లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆక్యుపంచర్, న్యాచురోపతి శిబిరాన్ని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆక్యుపంచర్ వైద్యం చాలా మెరుగైనదని ఆమె తెలిపారు. గతంలో తాను కూడా ఆక్యుపంచర్ వైద్యం చేయించుకున్నట్లు ఆమె తెలియజేశారు. ఎలాంటి మందులు లేకుండా తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

సాంస్కృతిక వైవిధ్యాన్ని భావి తరాలకు అందించాలి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం

రవీంద్రభారతి, జనవరి 19: భారతీయ వారసత్వం, సంస్కృతి, ఆధ్యాత్మిక అభ్యాసాలను నేటి యువతరానికి అందించాల్సిన అవసరం ఉందని, హరేకృష్ణ మూవ్‌మెంట్ చేసే పలు ప్రయత్నాలలో ఈ ఫెస్ట్ అంతర్భాగమని, హెరిటేజ్ ఫెస్ట్ వంటి సాంస్కృతిక పోటీలు సనాతనమైన మన భారతీయ వారసత్వం, సాంస్కృతిక వైవిధ్యం, అధ్యాత్మిక విలువలను నేటి యువతరానికి అందిండంలో ఎంతో కాలంగా సమాజంలో విశిష్ట పాత్రను పోషిస్తుందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ వార్షికోత్సవ సాంస్కృతికోత్సవమైన హెరిటేజ్ ఫెస్ట్ వేడుకలను ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పబ్లిక్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం, హరేకృష్ణ హైదరాబాద్, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ (తెలంగాణ, ఏపీ) అధ్యక్షులు సత్య గౌర చంద్ర దాస ప్రభూజీలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రతిభావంతులైన విద్యార్థులు సంప్రదాయ నృత్యం, నాటకం శాస్త్రీయ సంగీతం, భగవద్గీత శ్లోక పఠనం, వేదిక క్విజ్, రంగులు వేయడం వంటి వారికి బహుమతులను ప్రదానం చేశారు. సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, అంతరించిపోతున్న ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రాచీన కళలు మన పూర్వీకులు ప్రసాదించిన ప్రాచీన సంపద అని అన్నారు. పాశ్చాత్య విష సంస్కృతి నుంచి యువతను భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ పెంచేలా గురువులు కృషి చేయాలన్నారు.

అంతర్జాతీయ కరాటేలో నగర విద్యార్థుల సత్తా

కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో సత్తా చాటి పతకాలు సాధించిన విద్యార్థులు

చంపాపేట, జనవరి 19: అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటి ఏడు బంగారు పతకాలు, ఐదు రజతాలు, రెండు కాంస్య పతకాలను సాధించుకొచ్చారని భారత అండర్–19వ ప్రధాన కోచ్ ఆర్.రాజా నాయక్ అన్నారు. ఈ నెల 18, 19 రెండు రోజుల పాటు గోవాలోని మనోహర్ పారికర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు రమావత్ శాన్వినాయక్ రెండు స్వర్ణ, శ్రీకీర్తి రెండు స్వర్ణ, అర్జున్ సిద్దం ఒక స్వర్ణం, ఒక రజతం, డి భవ్యశ్రీ, ఒక స్వర్ణం, ఒక కాంస్యం, బి అయాన్స్ ప్రిన్స్ రెండు రజతాలు , ఆవుల సందీప్ కుమార్ ఒక స్వర్ణం, ధనస్వీ ఒక రజతం, ఒక కాంస్య పథకాలను గెల్చుకున్నారు. ఆ పోటీలో వారు సత్తా చాటి సాధించొచ్చిన పథకాలను ఆసియా భారతీయ కరాటే సమాఖ్య అధ్యక్షుడు భరత్ శర్మ చేతుల మీదుగా అందించినట్లు, కోచ్ ఆర్.రాజా నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోచ్ సి.కిషోర్ టీమ్ మేనేజర్ మానస పాల్గొన్నారు.


నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో డైరీని ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

పద్మశాలీలను విస్మరిస్తే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి

హిమాయత్‌నగర్, జనవరి 19: రాష్ట్రంలోని పద్మశాలీలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధా న్యత కల్పించాలని లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజినీర్స్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండు రంగయ్య హెచ్చరించారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో సంఘం ముఖ్యనేతల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీ జనాభాలో అత్యధిక సంఖ్యల్లో ఉన్న పద్మశాలీలకు చట్ట సభలో తగిన ప్రాతినిధ్యం లేదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలకు జనాభా ప్రాతి పదికన అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పద్మశాలీలు ఐక్యతతో ముందు